సాక్షి అనకాపల్లి

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



అప్రమత్తం

హోం మంత్రి అనిత వర్షాలు, వరదలపై ఉత్త రాంధ్ర జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. 8లో



క్రీడా ప్రతిభ

తగరపువలస: నేపాల్‌లో జరిగిన ఇంటర్నే షనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భీమిలి విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల నాలుగు రోజులు ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం చెప్పారు. ఈనెల 11న 3 మి.మీ, 12న 2, 13న 1, 14న 1, 15న 2 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

13 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు



పవిత్రాలతో దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, వైదికులు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 17 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏడాదంతా స్వామివారికి జరిగే నిత్యపూజలు, వార్షిక ఉత్సవాల్లో వైదిక పరంగా ఎలాంటి దోషాలు ఉన్నా వాటిని నివృత్తి చేసుకునేందుకు పవిత్రోత్సవాలు ఏటా నిర్వహించడం పరిపాటి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 13 నుంచి 17వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు. అలాగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా పవిత్రోత్సవాలను పురస్కరించుకుని పలు రకాల పవిత్రాలను ఇప్పటికే దేవస్థానం అధికారులు, వైదికులు కొనుగోలు చేశారు. వాటిని మంగళవారం సిద్ధం చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు, అర్చకులు పాల్గొన్నారు.

స్పిల్ వే గేట్ల ద్వారా తాండవ నీరు నిలిపివేత



స్పిల్‌వే గేట్ల ద్వారా నీటిని నిలుపుదల చేసిన ప్రాజెక్టు జేఈ రామకృష్ణ సిబ్బంది

నాతవరం : స్పిల్‌వే గేట్లు ద్వారా నదిలోకి తాండవ ప్రాజెక్టులో నీటి విడుదలను మంగళవారం ఉదయం నుంచి నిలుపుదల చేశామని ప్రాజెక్టు జేఈ రామకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులుగా ఎగువ ప్రాంతం నుంచి అధిక మొత్తంలో ఇన్‌ఫ్లో నీరు ప్రాజెక్టులోకి రావడంతో రిజర్వాయరు ప్రమాద స్థాయిని నివారించేందుకు నదిలోకి స్పిల్‌వే ద్వారా అధిక మొత్తంలో విడుదల చేశామన్నారు. వర్షం కురవపోవడంతో ఇన్‌ఫ్లో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిందన్నారు. మంగళవారం ఉదయానికి తాండవ రిజర్వాయరు నీటి మట్టం 377.9 అడుగులకు తగ్గడంతో స్పిల్‌వే పంట కాలువల ద్వారా విడుదల చేసే నీటిని విడుదల చేశామన్నారు. మంగళవారం ఇన్‌ఫ్లో నీరు 400 క్యూసెక్కులు వస్తుందని తెలిపారు. ఆయకట్టు పంట పొలాలకు నీరు కావాల్సినపుడు మాత్రమే ప్రధాన గేట్ల ద్వారా పంట కాలువలకు నీరు విడుదల చేస్తామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

విశాఖ సిటీ: ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించే గురుతర బాధ్యత వారిపై ఉంటుందని తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పేర్కొన్నారు. మంగళవారం తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వైస్ అడ్మిరల్ నేవల్ చిల్డ్రన్ స్కూల్, కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 10 నుంచి 12 తరగతుల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేశారు. అలాగే నేవల్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మళ్తీదేవికి ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు.

బీహెచ్ సిరీస్ వాహనదారులు పన్ను చెల్లించాలి

గోపాలపట్నం (విశాఖ): నగరంలో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ నంబర్లతో తిరుగుతున్న వాహనదారులు వెంటనే పన్ను చెల్లించాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం కోరారు. ఉపాధి/ఉద్యోగం కోసం ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లే వారి నమోదును సులభతరం చేయడానికి ఈ సిరీస్ ప్రారంభించింది. ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారో ఆ రాష్ట్రానికి పన్ను చెల్లించాలి. అక్కడే వినియోగించాలి. ఇతర రాష్ట్రాల్లో ఆ వాహనం వినియోగిస్తే ఆ రాష్ట్రం యొక్క పన్ను తప్పనిసరిగా చెల్లించాల్సి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్నవారు.. 4 రాష్ట్రాల్లో కంటే ఎక్కువ రాష్ట్రాల్లో బ్రాంచ్ ఉన్న ప్రయివేటు సంస్థల్లో పని చేసేవారికి మాత్రమే బీహెచ్ రిజిస్ట్రేషన్ వర్తిస్తుందని తెలిపారు. అయితే వాహనాన్ని వినియోగిస్తున్న రాష్ట్రంలో పన్ను చెల్లించకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చింతలపూడి పంచాయతీలో ఏరు దాటి బొర్రచింత గ్రామస్తులు నిత్యావసర సరకులు తీసుకెళుతున్న దృశ్యం (ఫైల్)

దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ రామన్నపాలెం గ్రామానికి చెందిన తామర్ల లక్ష్మిని ప్రసవం కోసం విశాఖ తీసుకెళ్లారు. డెలివరీ అనంతరం అంబులెన్స్‌లో తిరిగి ఆగస్టు 31న ఇంటికి తీసుకొస్తున్నారు. ఆ సమయంలో విపరీతంగా వర్షం కురిసి రోడ్డంతా బురదమయం కావడంతో అక్కడే దించేసి అంబులెన్స్ వెళ్లిపోయింది. దాంతో ఆ గ్రామస్తులు బాలింతను డోలీ కట్టి కొండ గెడ్డను దాటించి రామన్నపాలెం గ్రామానికి తీసుకెళ్లారు.

ఇదే గ్రామానికి చెందిన గర్భవతి చేదల నూకాలమ్మను వైద్య పరీక్షలకు తీసుకెళ్లే సమయంలో కొండగెడ్డ పారుతుంటే డోలీ మోతతో అతి కష్టం మీద దేవరాపల్లి పీహెచ్‌సీకి చేర్చారు. కానీ వర్షం పడడంతో గెడ్డ ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా గ్రామానికి తిరిగి రాలేక వారం రోజులపాటు ఆస్పత్రిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇదే గ్రామంలో సకాలంలో వైద్యం అందకపోవడంతో ముగ్గురు చిన్నారులు గమ్మెల ప్రవీణ్, నూకురి చిన్నారి, గమ్మెల కావ్య మృత్యువాత పడ్డారు. ఇలా అర్ధాయుష్షుతో ప్రాణాలు కోల్పోయిన వారెందరో..!

■ మన్యవాసుల తలరాత మారేదెప్పుడు? డోలీ మోతలు తీరేదెప్పుడు?

కన్నీటి రాదారి

- రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాలు
- వర్షం పడితే బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- దేవరాపల్లి మండలంలో 16 గ్రామాల దుస్థితి
- నిత్యం ప్రాణాపాయంతో గడుపుతున్న మన్యవాసులు



ప్రసవానంతరం డోలీలో బాలింతను తీసుకెళుతున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ఇది ఒక్క రామన్నపాలెం సమస్య కాదు.. ఏజెన్సీ గ్రామాల్లో నిత్యం వెంటాడే రహదారి సమస్య. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వెళ్లే దారి లేక.. సకాలంలో వైద్యం అందక.. మృత్యువాత పడుతున్న గిరిజనులెందరో.. మామూలు వర్షం పడితేనే మోకాళ్ల లోతు బురద నుంచి వెళ్లాలి.. ఇక భారీ వర్షం పడితే అంతే.. పీకల్లోతు నీటిలో నుంచి అవతల ఒడ్డుకు చేరుకోవలసిన దుస్థితి. అనారోగ్యవంతులను, వృద్ధులను డోలీ కట్టి ఇవతలి ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు చేర్చాల్సిందే. అత్యంత భారీ వర్షాలు వచ్చినప్పుడయితే గజ ఈతగాళ్లు రావాల్సిందే.

16 శివారు గ్రామాల పరిస్థితి దుర్భరం

దేవరాపల్లి మండలంలో వాలాబు, చింతలపూడి పంచాయతీల్లో ఉన్న 16 గ్రామాల ప్రజల దుస్థితి **ఎంతో బాధాకరం. వాలాబు పంచాయతీలోని 14 శివారు గ్రామాల ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. బొర్రచింత గ్రామానికి వెళ్లాలంటే కొండ గెడ్డ దాటాలి. ఆ గ్రామంలో 15 కుటుంబాల వరకు ఉంటా**యి. ఎన్ని రోజులు వర్షం పడితే అన్ని రోజులు జల దిగ్బంధంలో గడపాల్సిందే. కనీసం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాలాబుకు నిత్యావసర సరకులు తీసుకోవడానికి కూడా రాలేని దుస్థితి వారిది. ఈ పంచాయతీలో మిగతా గ్రామాలైన పూలగరువు, బుచ్చింపాలెం, నగరంపాలెం, బొడ్డబుమ్మి, బయట గరువు, కోడాపల్లి, రామన్నపాలేలకు ఇదే రోడ్డు పైనుంచి వెళ్లాలి. మండల కేంద్రమైన దేవరాపల్లి నుంచి 10 నుంచి 12 కిలోమీటర్ల మేర రోడ్డు వేస్తే ఈ గ్రామాల కష్టం తీరినట్టే. అదేవిధంగా చింతలపూడి పంచాయతీలో శివారు గ్రామమైన వీరభద్రంపేటకు, బొర్రచింత గ్రామానికి వెళ్లే రోడ్డు ఒక కిలోమీటర్ వరకూ ఉంటుంది. వీరభద్రంపేట జంక్షన్ నుంచి చింతలపూడి మెయిన్ రోడ్డుకు కిలోమీటరు దూరం. కనీసం గ్రావెల్ రోడ్డు అయినా వేయాలని గిరిజనులు మొర పెట్టుకుంటున్నారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారం కోసం వచ్చిన కూటమి పార్టీల నాయకులు వాలాబు పంచాయతీలో అన్ని గ్రామాలకు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ భారీ వర్షాల్లో తమ బతుకులు బురదమయమైనా ఎవ రూ పట్టించుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాట నిలబెట్టుకోవాలని వారు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దేవరాపల్లి మండలంలో అనేక గిరిజన గ్రామాలకు రహదారి సమస్య తీరింది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం కూడా తమ ఇక్కట్లు తీర్చాలని ఈ పంచాయతీ వాసులు కోరుతున్నారు.

తక్షణం స్పందించాలి..



మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దేవరాపల్లిలో వాలాబు, వీరభద్రంపేట పంచాయతీల్లో గల 16 గిరిజన గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించడం లేదు. కనీసం ఇంత పెద్ద ఎత్తున వర్షాలు పడినా ఈ ప్రాంత ప్రజలు ఎలా ఉన్నారో కూడా ఆలోచన చేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ విజయ కృష్ణన్ స్పందించాలని కోరుతున్నాం.

– డి. వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి

కూటమి నేతలు మాట నిలబెట్టుకోవాలి



మాది వీరభద్రంపేట గ్రామం. చినుకు పడితే రోడ్డంతా మోకాళ్లోతు బురద ఏర్పడుతుంది. ఒక మట్టి రోడ్డు ఉంది గానీ కనీసం గ్రావెల్ కూడా వేయలేదు. రోడ్డు వేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కూటమి నేతలు మాట నిలబెట్టుకోవాలి. భారీ వర్షాలు పడినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు.

– జర్త ఈశ్వరరావు, వీరభద్రపేట, చింతలపూడి పంచాయతీ

వర్షాలు ఆగినా.. నీరు తగ్గదు..



మాది నగరపాలెం గ్రామం. వారం రోజుల పాటు వర్షం పడితే కనీసం నిత్యావసర సరకులు కూడా తీసుకోలేని పరిస్థితి ఉంటుంది. నెల వ్యవధిలో రెండుసార్లు భారీ వర్షాలు వచ్చాయి. ఒక్క అధికారి కూడా మా దగ్గరకు రాలేదు. వర్షాలు ఆగినా.. నీరు తగ్గడానికి మరో మూడు నాలుగు రోజులు పడుతుంది. అప్పటివరకూ మాకు నిత్యావసర సరకులు అందడం కష్టమే.

–కొండబాబు, నగరపాలెం గ్రామం, వాలాబు పంచాయతీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు.. మాడుగుల నియోజకవర్గంలో కాలినడకన వెళ్లడం కూడా సాధ్యం కాని కొండదారులను బంగారు బాటలుగా అభివృద్ధి చేశారు. 106 గిరి గ్రామాలకు చక్కని రహదారులు అందుబాటులోకి తెచ్చారు. చింతలపూడి పంచాయతీలో కొండలపై ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు రెండు కోట్లతో రోడ్లు వేశారు. రూ.60 కోట్లతో 520 సీసీ రోడ్లను పూర్తి చేశారు.

మోదీ గారూ.. స్పందించాలి మీరు..



పోస్టుబాక్స్‌లలో ఉత్తరాలు వేస్తున్న కూలీలు

- పశ్చిమ బెంగాల్‌లో ఉపాధి పనులు కల్పించాలని ప్రధానికి కూలీల లేఖ

మునగపాక: పశ్చిమబెంగాల్‌లో ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మునగపాక మండలం నుంచి పలువురు ఉపాధి కూలీలు పోస్ట్‌బాక్స్‌ల ద్వారా ఉత్తరాలు పంపుతున్నారు. మంగళవారం మండలంలోని గణపర్తిలో పలువురు కూలీలు లేఖలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా పశ్చిమబెంగాల్‌లో ఉపాధి హామీ పథకం పనులు ఇవ్వకపోవడంతో 2.57 కోట్ల మంది కూలీలు పస్తులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళలు, దళితులు, భూమిలేని కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానమంత్రి స్పందించి ఆ రాష్ట్రంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. ఇందు కోసం కూలీలంతా పోస్టుకార్డుల ద్వారా మోదీకి తమ అభ్యర్థన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి కూలీ తన వంతు సాయంగా ఒక రూపాయి మనీఆర్డర్ చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్టా అప్పారావు, పలువురు కూలీలు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో ప్రత్యేక నిఘా

- సెజ్‌లో ప్రమాదాల పట్ల అప్రమత్తం
- మైనర్ల డ్రైవింగ్‌పై దృష్టి
- గంజాయి రవాణా, నియంత్రణపై చర్యలు
- జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాలు
- రాంబిల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ దీపిక

రాంబిల్లి (యలమంచిలి) : పారిశ్రామిక ప్రాంతం ఎస్ఈజెడ్‌లో తరచూ జరుగుతున్న ప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌ను పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణతో కలసి సందర్శించారు. ముందుగా రాంబిల్లి నేవల్‌బేస్‌లోకి వెళ్లి నేవల్‌బేస్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. సాయంత్రం రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ రాంబిల్లి మండలం సముద్రతీర ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెట్టి అనుమానితుల కదలికలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సముద్రం వద్ద స్నానాలకు ఎవరూ వెళ్లకుండా తీర ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి రవాణా, బెల్టు షాపులు, డ్రంకెన్ డ్రైవ్‌పై నిఘా పెట్టి నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై దృష్టి సారించాలని, రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని నేరాలు, చోరీల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 14న లోక్ అదాలత్ సందర్భంగా కేసులలో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి స్వచ్ఛందంగా రాజీపడేలా చేసి కేసుల సంఖ్యను తగ్గించడానికి కృషి చేయాలని సీఐ నర్సింగరావుకు సూచించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఏపీఐఐసీ అధికారుల దూకుడు

- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా కారిడార్ భూముల్లో పనులు
- పోలీసు బందోబస్తుతో చందనాడలో పనుల ప్రారంభం
- మాట మార్చిన టీడీపీ నాయకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



చందనాడ ఏపీఐఐసీ భూముల్లో షెడ్ల నిర్మాణానికి పొక్లెయిన్లతో పనులు ప్రారంభించిన దృశ్యం



పనులు ప్రారంభించే చోట పోలీసుల బందోబస్తు

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో ఏపీఐఐసీ అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. పదేళ్లుగా లేని తొందర ఇప్పుడే రావడం పట్ల నిర్వాసితులు, రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ అధికారులకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి పూర్తి స్థాయిలో నష్ట పరిహారం, ప్యాకేజీలు, పునరావాస కార్యక్రమాలు చేపట్టకుండా అధికారులు భూముల్లోకి వచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు ప్రారంభించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క రైతులు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ప్రత్యేక ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని తమకు పునరావాసం కల్పించాలని ఆందోళనలు చేస్తున్నారు. అలాగే నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు రూ.24 లక్షల చొప్పున పునరావాసం ప్రత్యేక ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు పనులు ప్రారంభించడానికి వీల్లేదంటూ గత రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి, కలెక్టర్, ఏపీఐఐసీ అధికారులు చెబుతూనే మరోపక్క దూకుడుగా పోలీసు బందోబస్తు మధ్య పనులు ప్రారంభించేందుకు బుధవారం స్థానిక రెవెన్యూ సిబ్బంది, ఏపీఐఐసీ అధికారులు చందనాడ గ్రామానికి వెళ్లడం చర్చనీయాంశమయింది. చందనాడలో సర్వే నెం.65లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేసే లేబర్ నివాసం ఉండేందుకు షెడ్లు, ఏపీఐఐసీ అధికారులు పర్యటించేందుకు వచ్చే సమయంలో వేచి ఉండేందుకు, పనులు పర్యవేక్షించేందుకు క్యాబిన్ల నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పొక్లెయిన్లతో చదును చేసే పనులు ప్రారంభించారు. గతంలో రైతుల్ని రెచ్చగొట్టి వారికి అండగా నిలిచిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి రాగానే అదే రైతులను మోసం చేసే విధంగా పరిహారం ఊసెత్తకుండా ఏపీఐఐసీ అధికారుల ద్వారా పనులు ప్రారంభించడం తగదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించిన ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించలేదని ఆరోపిస్తున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య పనులు ప్రారంభించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఐఐసీ అధికారుల దూకుడును అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన బాట

- జీవో 85 రద్దు చేయాలంటూ నేటి నుంచి నిరసనలు

సాక్షి, అనకాపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు వ్యతిరేకంగా ఉన్న జీవో నంబర్ 85ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది. ఈ జీవోకు వ్యతిరేకంగా ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులంతా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరావు వెల్లడించారు. అసోసియేషన్ తరఫున డాక్టర్ సాయికిరణ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని, ఇలా అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని అన్నారు. గత రెండు నెలలుగా జీవో 85 రద్దు చేయమని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి అర్జీలు సమర్పించినప్పటికీ.. ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. కోవిడ్-19 సమయంలో తమ జీవితాలను పణంగా పెట్టి సేవలు అందించినప్పటికీ, ఇప్పుడు జీవో 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమని, ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళన చేపట్టాలని నిర్ణయించుకున్నామన్నారు.

డాక్టర్ల ఆందోళన కార్యక్రమాలు ఇలా..

- ఈనెల 10న – నిరసనగా నల్ల బ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహిస్తారు.
- 11, 12 తేదీల్లో – సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుంది.
- 13న – అత్యవసర సేవలు మినహాయించి, అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తారు
- 14న – పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితమవుతాయి.
- 15న–'చలో విజయవాడ'.. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద నిరసన
- 16న– జీఓ 85 రద్దు చేసే వరకూ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం

జీవో 85లో ఏముందంటే..!

కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే జీవో 85ను తీసుకొచ్చారు. గతంలో పీహెచ్‌సీలో పనిచేసే ఎంబీబీఎస్ డాక్టర్లకు పీజీ సీట్లలో 30 శాతం కోటా ఉండేది. దాన్ని 15 శాతానికి తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం జీవో 85ను తీసుకొచ్చింది. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యం చేసేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లు మొగ్గు చూపే అవకాశం తగ్గిపోతుంది. అదేకాకుండా పీజీలో నాలుగు కోర్సులకు మాత్రమే ఆ 15 శాతం కోటా వర్తిస్తుంది. అది కూడా ప్రభుత్వం ఇచ్చిన నాలుగు స్పెషలైజేషన్లలోనే.. అందుకే ఈ జీవో పట్ల నిరసన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

నేడు ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం(విశాఖ): ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జోన్–1 ఉపసంచాలకులు ఆర్.వి.రమణ తెలిపారు. ఈ ఏడాది జూలైలో పరీక్షలు రాసిన ఐటీఐ అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని కోరారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కంపెనీలతో పాటు 10కి పైగా ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉదయం 9 గంటలకు నేరుగా మేళాకు బయోడేటా, ధ్రువ పత్రాలతో హాజరుకావాలన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

పెందుర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి సాయికృష్ణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫైజర్, హెటిరో ల్యాబ్, కేఎల్ గ్రూప్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లమా ఇన్ ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99487 68778 నంబర్లలో సంప్రదించాలన్నారు.

13న జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. క్రైడ్ రైట్ ఫైనాన్స్, ఇన్నోవ్‌సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 120 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ మేనేజర్, సీనియర్ మేనేజర్, క్రెడిట్ కార్డ్స్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, టెక్కలి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.15 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఉంటుందన్నారు.

కొండలు.. పిండి చేస్తూ..



కేవో మల్లవరం రహదారిలో తరిగిపోయిన కొండ



యండపల్లి శివారు వజ్రగడ రహదారిలో తవ్వకాలతో కొండ పరిస్థితి

- యథేచ్ఛగా తవ్వకాలు
- రెచ్చిపోతున్న కూటమి నాయకులు
- పట్టించుకోని అధికారులు

కోటవురట్ల: కొండలు కరిగిపోతున్నాయి.. గుట్టలు తరిగిపోతున్నాయి.. నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాకతోనే అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. అందినకాడికి దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారు. కన్ను పడితే చాలు కొల్లగొట్టేస్తున్నారు. పచ్చని కొండలు, నదులు, చెరువులు ఏదైనా కానీ దోచుకునేందుకు కాదేదీ అనర్హం అన్నట్టు ఉందని 'పచ్చ'నాయకుల తీరు. కోటవురట్ల మండలంలో అనేక వనరులు ఉన్నాయి. ఇసుక తవ్వకాలకు వరాహ, సర్పా నదులు ఉండగా, గ్రావెల్ తవ్వకాలకు కొండలకు కొదవేలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఆ పార్టీల నాయకుల కన్ను అక్రమ సంపాదనపై పడింది. గ్రావెల్ తవ్వకాలతో కొండలను పిండి చేసి తరలించుకుపోతున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా గ్రావెల్ తరలిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారుల అండతోనే గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వందలాది ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిపోతున్నా ఏమీ తెలియనట్టే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ రెండు నెలల్లో కొండలు సగం వరకు తరిగిపోయినా ఇటు రెవెన్యూ, అటు మైనింగ్ శాఖాధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

రాత్రీ పగలూ తేడాలేకుండా..

మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో చినబొడ్డేపల్లి నూకాలమ్మ కొండ, కరణం కొత్తూరు, కేవో మల్లవరం రోడ్డులో ఉన్న కొండలపై అక్రమ క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. కరణం కొత్తూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ మూడు కొండలపై తవ్వకాలు జరుపుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. జేసీబీతో కొండను తవ్వి ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిపోతుండగా ఇప్పటికి దాదాపుగా రూ.2 కోట్ల పైగా ప్రభుత్వ ఖజానాకు గండిపడినట్టు అంచనా. ఈ మూడు కొండలు సగానికి పైగా తరిగిపోయాయి. మండల స్థాయి టీడీపీ నాయకుని అండతోనే తవ్వకాలు జరుపుతున్నట్టు సమాచారం. ఇందుకు పై స్థాయి ప్రజా ప్రతినిధుల సహకారం ఉండడంతోనే రూ.కోట్లలో వ్యాపారం సజావుగా సాగిపోతున్నట్టు చెబుతున్నారు. ఇదే విధంగా యండపల్లి శివారున వజ్రగడ వెళ్లే రహదారిలో ఓ కొండపై అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఇక్కడ కూడా వందలాది ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలించుకుపోయారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతి ఇచ్చిన కొండల పరిరక్షణకు కృషి చేయాలని కోరుతున్నారు.

కొండలు తరిగిపోతున్నాయి..



కొందరు అక్రమార్కులు కొండలను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. పచ్చని కొండలు పిండి అవుతున్నాయి. నిత్యం వందలాది ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. అధికారులు పట్టించుకోకపోతే కొండల ఆనవాలు కూడా ఉండవు.

– గొర్లు నానిబాబు, యండపల్లి

అడ్డూ అదుపూ లేదు..



చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో మూడు కొండలపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రెండు నెలలుగా నిరంతరాయంగా గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. కొండలు సగానికి పైగా తరిగిపోయాయి. రోజూ రాత్రీ పగలూ తేడా లేకుండా జేసీబీలతో తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– పైల శివరామ్, సర్పంచ్, చినబొడ్డేపల్లి

త్వరగా క్రీడాభివృద్ధి పనులు పూర్తి చేయండి



జిల్లా క్రీడాభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన క్రీడాభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం జిల్లా క్రీడాభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నక్కపల్లిలో హాకీ మినీ గ్రౌండ్, పరవాడలో క్రికెట్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వి.మాడుగులలో 200 మీటర్ల ట్రాక్ నిర్మాణం, వాలీబాల్, బ్యాడ్మింటెన్ మైదాన పనులు, చోడవరంలో వాలీబాల్ కోర్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. రాంబిల్లి హైస్కూల్‌లో ఫీల్డ్ డెవలప్‌మెంట్, అచ్యుతాపురం హైస్కూల్‌లో ప్లే ఫీల్డ్ డెవలప్‌మెంట్ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైన వీఆర్‌ఏ ప్రభావతిపై పునర్విచారణ



కొవ్వూరు పంచాయతీ కార్యాయంలో విచారిస్తున్న అధికారులు, సర్పంచ్ కాంతమ్మ, మాజీ సర్పంచ్ భాస్కరరావు, ఫిర్యాదుదారులు

రోలుగుంట: తప్పుల తడకగా ఓటరు జాబితా రూపొందించి సస్పెన్షన్‌కు గురైన వీఆర్‌ఏ శీరం దాసు ప్రభావతిపై అధికారులు మంగళవారం పునర్విచారణ చేపట్టారు. కొవ్వూరు గ్రామంలో గతేడాది ప్రభుత్వం నిర్వహించిన ఓటరు సర్వేలో బీఎల్వోగా విధులు నిర్వహించిన ఆమె.. ఓటరు జాబితా నుంచి మాజీ సర్పంచ్ కె.ఈశ్వరరావు సహా 13 మందిని తొలగించారు. దీనిపై అప్పటి చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమిలా గాంధీ విచారణ చేపట్టి.. గతేడాది నవంబర్‌లో ప్రభావతిని సస్పెండ్ చేశారు. మళ్లీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కైసర్ల వరహాలు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారులు బంటు రాజు, మాధవరావు, బాధిత ఓటర్లతో సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, మాజీ సర్పంచ్ మలసాల భాస్కరరావు సమక్షంలో విచారించారు. ఈ విచారణలో 13 మంది బాధిత ఓటర్లకు గాను ఏడుగురే హాజరయ్యారు. హాజరైన ఓటర్ల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. మరో నలుగురిని విచారించాల్సి ఉంది. దీనిపై తహసీల్దార్ వరహాలు మాట్లాడుతూ తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో ఎస్.శివభాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



వైద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల బకాయి జీతాలను తక్షణం చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక వైద్యాలయం వద్ద మంగళవారం కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి జీతాల కోసం పారిశుధ్య కార్మికులు పది రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ నెల 15వ తేదీలోపు బకాయిపడిన ఆరు నెలల కార్మికుల జీతాలు చెల్లించని పక్షంలో సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం కార్మికులు ఎస్.సంతోష్, ఎ.ప్రసాద్, నూక రాజు, రామ్‌ప్రసాద్, కిరణ్, సుధీర్, వెంకటలక్ష్మి, జగన్నాథరావు, వరలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై 'కూటమి' హామీ ఏమైంది?

- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకున్నట్టు కేంద్రంతో ప్రకటన చేయించాలి
- సీపీఎం, సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో



మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నడుస్తుందని, అయినా స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు కాపాడలేకపోతున్నారని నిలదీశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ సీపీఎం, సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూచౌక్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందన్నారు. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు ఉండగా.. గతేడాది 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారన్నారు. ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది రోజుకు రూ.10 కోట్లు నష్టం రాగా, ప్రస్తుతం రోజుకు రూ.15 కోట్లు చొప్పున నష్టం వస్తుందన్నారు. విశాఖ స్టీల్‌కు దేశంలోనే డిమాండ్ ఉందని, మోదీ ప్రభుత్వం ఉత్పత్తి తగ్గించి నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌పరం చేయాలని కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ప్లాంట్‌ను కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ ఇటీవల సందర్శించారని, అయినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. 2024 ఎన్నికలకు ముందు ప్రైవేటీకరణ చేయాలని టెండర్లు కూడా పూర్తి చేసిన నగర్నార్(ఛత్తీగఢ్) స్టీల్ ప్లాంట్ విషయంలో ఉపసంహరించుకుంటున్నట్టు అమిత్‌షా ప్రకటించారని గుర్తు చేశారు. తెలంగాణలోని సింగరేణిని కూడా ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల మాత్రం ఎందుకు వివక్షత చూపుతున్నారని వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వామపక్ష రాష్ట్ర, జిల్లా నాయకులు కె.లోకనాథం, ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆర్.దొరబాబు, వై.ఎన్.భద్రం, సిహెచ్.రాంబాబు, డి.డి.వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సముద్ర ఉత్పత్తుల పరిరక్షణపై అవగాహన

మహారాణిపేట(విశాఖ): అరుదైన మత్స్య జాతుల సంరక్షణపై సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ మత్స్యకారులకు అవగాహన కల్పించింది. ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సదస్సులో ఐసీఏఆర్ –సీఎంఎఫ్ఆర్ఐ విశాఖపట్నం ప్రిన్సిపాల్ డాక్టర్ జాయ్ కె. కుదాన్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పి. రంజన్ బెహరా, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల అధికారి మంగమ్మ సముద్ర జాతుల పరిరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ముఖ్యంగా సముద్ర తాబేళ్లు, డాల్ఫిన్ల వంటి వాటి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సదస్సులో రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఉపాధ్యక్షులు జి. పరశురాం, వాసుపల్లి రాజు, కేఎఫ్ రాజు, కార్యదర్శులు వి. ఎల్లారావు, మున్నం బాలాజీ, కోలా ఎల్లయ్య, అమర కొండ, బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం



అనకాపల్లి నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు

- ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందం
- హోం శాఖ మంత్రి అనిత

మహారాణిపేట(విశాఖ): ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాలు, సహాయక చర్యలపై ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందాలను సిద్ధం చేసి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సహాయక చర్యలపై శిక్షణను ఇవ్వనున్నామన్నారు. ఆయా జిల్లాల్లో జలాశయాల స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. అలాగే భారీ వర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాల్లోని ముంపు, పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

అనకాపల్లి జిల్లాలో 40 ఇళ్లు, 80 కి.మీ. రోడ్లు ధ్వంసం

సాక్షి, అనకాపల్లి: ఈ నెల 6, 7, 8 తేదీల్లో కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో 40 ఇళ్లు దెబ్బతిన్నాయని, 80 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. దెబ్బతిన్న 40 ఇళ్లలో 36 పాక్షికంగా, 4 పూర్తిగా పాడయ్యాయని చెప్పారు. దెబ్బతిన్న కల్వర్టును పునరుద్ధరిస్తున్నామని, జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి 33 కేవీ ఫీడర్లకు ఎటువంటి నష్టం జరగలేదని, 11 కేవీ ఫీడర్లకు మాత్రం కొంతమేర నష్టం వాటిల్లిందని చెప్పారు. సుమారు 48 పోల్స్ వరకు దెబ్బతిన్నాయని, వాటిని 24 గంటల్లో పునరుద్ధరిస్తామని వివరించారు. గ్రామాల్లో శానిటేషన్, మంచినీటి సరఫరా నిరంతరం చేస్తున్నామన్నారు. జిల్లాలో ఐదు ప్రధాన రిజర్వాయర్లు ఉండగా రైవాడ మినహా మిగిలిన రిజర్వాయర్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. వీసీలో జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ధిక్కార స్వరం దాశరథి



మాట్లాడుతున్న అరసం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

విశాఖ సిటీ: వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్యులు అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగుశాఖ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో టీఎల్ఎన్ సభా హాల్‌లో కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిజాం పాలనలో ప్రజల కడగండ్లను చూసి చలించి నిజాంపై అక్షర శస్త్రాలను సంధించారని తెలిపారు. సాహితీ పోరాటంతో పాటు సాయుధ పోరాటం కూడా చేసిన వారు ఇద్దరే కవులని వారిలో ఒక దాశరథి కృష్ణమాచార్యకాగా.. మరొకరు శివసాగర్ అని పేర్కొన్నారు. దాశరథి సాహిత్యంలో తెలంగాణ రైతాంగ పోరాటం, జాతీయవాదం, అభ్యుదయ కవిత్వం, భావ కవిత్వం కనిపిస్తాయన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1920 దశకంలో పుట్టిన గొప్పకవుల్లో దాశరథి ఒకరని, ఆయన గురించి రేపటి తరం తెలుసుకోవాలని సూచించారు. భాషకు హద్దులు లేవని, జాషువా విశ్వ నరుడు ప్రస్తావన తెస్తూ కొందరు తెలంగాణ కవులు విభజన వాదం తేవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకుడు ఆర్‌వీ రామారావు, హైదరాబాద్ సిటీ కాలేజ్ ఆచార్యుడు, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, వైవీకే అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జేవీ సత్యనారాయణమూర్తి, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య చందు సుబ్బారావు, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు విస్తాలి శంకర్రావు, అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి సోమశిల తిరుపోలు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, అరసం వైవీకే మార్క్సిస్టు అధ్యయన కేంద్రం సభ్యుడు ఎం.పైడిరాజు పాల్గొన్నారు.


అప్పులబాధతో ప్రిన్సిపాల్ ఆత్మహత్య



అప్పారావు (ఫైల్)

పీఎంపాలెం(విశాఖ): తలకుమించిన అప్పులు తీర్చలేక ఓ ప్రయివేటు స్కూల్ ప్రిన్సిపాల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధురవాడ కొమ్మాది జంక్షన్ సమీపంలోని సాయిరామ్ కాలనీలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయిరామ్ కాలనీలో కుటుంబంతో నివసిస్తూ స్థానికంగా ఓ ప్రయివేటు విద్యాసంస్థను అప్పారావు (53) నిర్వహిస్తున్నాడు. ప్రిన్సిపాల్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. భార్య జ్యోతి అతనితో పాటు ఉండగా కుమార్తె, కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. అప్పారావు భారీగా అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య జ్యోతితో తరచూ గొడవలు అయ్యేవి. ఈ క్రమంలో జ్యోతి దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి భార్యాభర్తలను సముదాయించారు. మంగళవారం 11 గంటల సమయంలో తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అప్పారావును భార్య జ్యోతి ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పీఎం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు జలాశయం



ప్రమాద స్థాయికి చేరుకున్న పెద్దేరు జలాశయం

- అప్రమత్తమైన అధికారులు

మాడుగుల : మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో అధిక వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం సాయంకాలానికి ప్రమాద స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 1300 క్యూసెక్కులు వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరడంతో అధికారులు అప్రమత్తమై జలాశయం ప్రధాన గేటు ద్వారా 600 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి వరద నీరు పెరిగితే రెండో గేటు ఎత్తుతామని అధికారులు చెబుతున్నారు. పంట పొలాలకు ప్రతి రోజు 120 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేస్తున్నారు. పెద్దేరు ఆయకట్టు 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి చేలకు ఢోకా లేదని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది జూలైలో విత్తనాలు చల్లేటప్పుడు ఒక తుపాను, వరి నాట్ల సమయంలో మరో తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోయిందన్నారు. నీట మునిగి పంటలను సకాలంలో గుర్తించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకుడు బొడ్డు సోమరాజు, రైతు సంఘం నాయకుడు ఆడారి బుచ్చి రాము, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడా అప్పారావు, మత్స్యకారుల సంఘం నాయకుడు వాసుపల్లి తాతయ్య, సామాజిక సేవకుడు బర్నికాన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో చక్కటి కంటిచూపు

అనకాపల్లి : విద్యార్థి దశ నుంచి కంటి చూపు మందగించకుండా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని దిబ్బపాలెం హైస్కూల్ హెచ్ఎం జి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో హైస్కూల్ ఆవరణలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వైద్య సిబ్బందితో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలను చూడగలిగే శక్తి కంటికి మాత్రమే ఉందన్నారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడంతో కంటిచూపు సమస్యతో బాధపడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం : ఈ నెల 16న జరగనున్న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. పోటీలు ఈ నెల 13న నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ మెయిన్ నందు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 44 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,540	4,540
రెండో రకం	----	----
మూడోరకం	3,100	3,300

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	:సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	:పర్తిసాయి
సరిపోదా శనివారం	:షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
నేను కీర్తన	: శ్రీసత్య
11 డిమోంటి కాలని	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 96 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-19 యూనిట్లు, బి పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

భయపెడుతున్న సీజనల్ వ్యాధులు

- ఎడతెరిపి లేని వర్షాలతో చుట్టుముడుతున్న వ్యాధులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న వైరల్ ఫీవర్ బాధితులు

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మురుగు, చెత్త పేరుకుపోయి వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఎన్టీఆర్ ఆస్పత్రిలో జ్వరపీడితులు



బురద, మురుగుతో దుర్గంధంగా ఉన్న తుమ్మపాల సంత పరిసరాలు



ఇంటింట ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

తుమ్మపాల : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు వెల్లువెత్తాయి. మురుగు ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయి అపారిశుధ్యం, దుర్గంధం అలుముకుంది. సీజనల్ వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ జ్వరాలు వచ్చి ఒకటి రెండు రోజులకు తగ్గిపోయినా తర్వాత మొదలయ్యే సమస్యలను తలచుకుంటే జ్వరం అనే మాటే భయపెడుతుందని బాధితులు వాపోతున్నారు.

ఒంటి నొప్పులు, కీళ్ల బాధలు, మోకాళ్ల నొప్పులే కాకుండా మోకాలి నుంచి కాలి పాదాల వరకు వాపులతో అడుగు తీసి అడుగెయ్యాలంటేనే భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల జ్వరం తగ్గాక శరీరంపై దద్దుర్లతో కూడిన ఎర్రటి మొటిమలు రావడంతో బాధితులు భయపడుతున్నారు. అంతే కాకుండా కొంత మందిలో కాళ్ల పట్టు వదిలేయడంతో నిలబడలేని పరిస్థితి తలెత్తుతోందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలు కొందరిలో రెండు వారాలు, మరి కొందరిలో నాలుగు నెలల పాటు ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారంటూ భయపడుతున్నారు. ఈ జ్వరాల వల్ల ప్లేట్‌లెట్స్ పడిపోవడం, చిన్నపిల్లల్లో రక్తంలో ఇన్ఫెక్షన్ శాతం అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు..

మండలంలో అధిక సంఖ్యలో జ్వరపీడితులు ఆయా ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఉన్న జిల్లా ఆస్పత్రికి విష జ్వరాల బాధితులు అధికంగా వస్తున్నారు. అంతే కాకుండా పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు మండలంలోని 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో క్లినిక్‌లు, ఆర్ఎంపీ వైద్యుల వద్ద నిత్యం వందల సంఖ్యలో జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వే ద్వారా ఏఎన్ఎం, ఆశ వర్కర్లు కొంత మేర మందులు పంపిణీ చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉంటే వారిని గుర్తించి వైద్యుల సూచనల మేరకు ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు.

అంతంతమాత్రంగా పారిశుధ్య నిర్వహణ ..

జ్వరాలతో జనం అతలాకుతలం అవుతున్నప్పటికీ పట్టణం, మండలంలో పారిశుధ్య నిర్వహణపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. అడుగడుగునా నిర్లక్ష్య ధోరణి కనబడుతోంది. గతంలో బాగున్న పారిశుధ్య నిర్వహణ నేడు గాడి తప్పిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఏ రహదారిలో చూసినా చెత్తకుప్పలు, మురుగు పారని డ్రైనేజీలు, దోమలకు ఆవాసాలుగా పెరిగిన పిచ్చిమొక్కలతో మురికికూపాల్లా దర్శనమిస్తున్నాయి. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధుల పైనా, పరిసరాల పరిశుభ్రత పైనా అవగాహన కల్పిస్తున్నప్పటికీ అధ్వానంగా ఉన్న పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు ఇటు మున్సిపల్ అధికారుల్లోను, అటు పంచాయతీ అధికారుల్లోను ఎటువంటి చలనం లేకపోవడంతో జనం జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో అపారిశుధ్యం మరింత దారుణంగా ఉంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

ఇటీవల కురిసిన వర్షాలకు ప్రతి చోట నీరు నిల్వ అవుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది పలు రకాల విషజ్వరాలు సోకేందుకు అవకాశం ఉంది. ప్రతి ఇంటితో పాటు పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఏఎన్ఎం, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. విష జ్వరాల బారిన పడిన వారిని గుర్తించి తక్షణమే మందులు పంపిణీ చేస్తున్నాం. ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు అదుపులో ఉంటాయి. గ్రామాల్లో విషజ్వరాల సమస్య లేదు. **– డాక్టర్ నుస్రిత్ షమీమ్,** మెడికల్ ఆఫీసర్, తుమ్మపాల పీహెచ్‌సీ

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్



అనకాపల్లి : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. మంగళవారం 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వల్లే బుడమేరు వరద నీరు విజయవాడను ఎన్నడూ లేని విధంగా ముంచేసి అపార నష్టం కలిగించిందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను గాలికొదిలేసిందని, సరైన సాయం అందక బాధితులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో ముఖ్యమంత్రి ఫొటోల కోసం, పబ్లిసిటీ కోసం ఎగబడుతున్నారని, బాధితులను ఆదుకోవడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి ఆఫీసులో ఉండి అధికారులను మోనిటర్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దకుండా అధికారులను తన వెంట వేసుకొని తిరుగుతూ ప్రచారం చేసుకొంటున్నారని ఆరోపించారు. 1968, 1986, 1990, 2005 సంవత్సరాల్లో కూడా బుడమేరు చానెల్‌లో ఇంతకంటే రెట్టింపు నీరు వచ్చినా అప్పటి ముఖ్యమంత్రులు దాన్ని చాలా చక్కగా నిర్వహించి ప్రజలను రక్షించారన్నారు. ప్రభుత్వ పెద్దల ఆస్తులను కాపాడుకునేందుకు బుడమేరు వాగు గేట్లు ఎత్తివేయించి విజయవాడను ముంచేశారన్నారు. బుడమేరుతో ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. వరద వస్తుందని ముందుగా చెప్పి ఉంటే జాగ్రత్త పడేవారని, సహాయ చర్యల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో నేటికీ విజయవాడ వాసులు వరదనీటిలో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. వరద ప్రళయంతో అన్ని వర్గాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీసం ఆహారం, తాగునీరు అందించకపోవడంతో వరద బాధితులు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రభుత్వం ముందుస్తు వరద హెచ్చరికలు చేసి ఉంటే ప్రజలు నష్టపోయే వారు కాదని తెలిపారు. ఇప్పటికైనా బాధితులకు తగిన సహాయం అందించి ఆదుకోకపోతే వారికి న్యాయం జరిగే వరకు పార్టీ అధినేత జగన్ సారథ్యంలో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఆపన్నులను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి



వరద బాధితులకు పంపుతున్న సరకుల వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ అప్పారావు

అనకాపల్లి : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని డీఎస్పీ అప్పారావు అన్నారు. తుమ్మపాల గ్రామంలో ఎస్వీడీఎస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, మిల్లెట్స్ మంగళవారం విజయవాడ వరద బాధితులకు పంపిస్తున్న వ్యాన్‌ను ప్రారంభించారు. డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు సహాయం చేస్తున్నాయని, ఎస్వీడీఎస్ సంస్థ ద్వారా 10 బస్తాల బియ్యం, మిల్లెట్ పౌడర్, గోధుమ పిండి, దుప్పట్లు, బిస్కెట్లు, శానిటరీ ప్యాడ్లు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ఎస్వీడీఎస్ కార్యదర్శి జోగి నాయుడు, సభ్యులు సత్యనారాయణ, వీజేఎస్ఎస్ శివ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సక్రమమైన డ్రైనేజీతో వ్యాధులకు చెక్

అనకాపల్లి : డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటే ప్రజలకు వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, మండలంలో డ్రైనేజీ వ్యవస్థను ఆయా ప్రాంతాల ప్రజలు అక్రమించడంతో తుపాన్లు, వర్షాల సమయంలో నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో రహదారులపైకి వస్తుందని, డ్రైనేజీలు రహదారులపై పారడం వల్ల ప్రజలు విష జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



షేకిళ్లపాలెం సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదులుతున్న డీపీవో శిరీషారాణి

యలమంచిలి రూరల్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం యలమంచిలి మండలం షేకిళ్లపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయకర్త నాగలక్ష్మితో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువు తయారీకి వానపాములను విడిచిపెట్టారు. జిల్లాలో 646 పంచాయతీల్లో 515 సంపద తయారీ కేంద్రాల షెడ్లు నిర్మించగా, వాటిలో చాలా వరకు వినియోగంలో లేవన్నారు. ఈ కేంద్రాలన్నీ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నాటికి వినియోగంలోకి తేవడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. మండల పంచాయతీ విస్తరణాధికారులు తరచూ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరు మెరుగుపర్చడానికి కృషి చేయాలని సూచించారు. క్లాప్ మిత్రలతో మాట్లాడి కేంద్రాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. అనంతరం షేకిళ్లపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష జరిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరిగేందుకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని డీపీవో కార్యదర్శులకు సూచించారు. యలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో నిలిచిపోయిన నీటిని తొలగించాలి



మాట్లాడుతున్న ఆర్ఏఆర్ఎస్ ఇన్‌చార్జి ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి : వరి పైరు నాటిన వెంటనే లేదా పిలకల దశలోనైనా ముంపునకు గురైతే వర్షాల అనంతరం నీటిని బయటికి తీసేసి పైరు కోలుకోవడానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి ఇన్‌చార్జి డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికి తెగుళ్ల వ్యాపించకుండా 2 గ్రాముల కార్బెండజిం, మంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకు తోటల్లో నిల్వ నీటిని వీలైనంత త్వరగా బయటికి పంపాలని, ముంపునకు గురైన తోటల్లో నీరు తగ్గిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్‌ను మొక్కల మొదళ్ల వద్ద గుంతలలో వేసుకోవాలని తెలిపారు. మొవ్వ కుళ్లు ఆశించిన తోటల్లో 1 గ్రాము కార్బెండజిం లేదా 3 గ్రాముల మాంకోజెబ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తెగులు సోకిన తోటల నుంచి నీటిని ఆరోగ్యకరమైన తోటలకు పారకుండా చూడాలని చెప్పారు. మొక్కజొన్న పంటలో ఎట్టి పరిస్థితుల్లోను 48 గంటల్లో పొలంలో నిలిచిపోయిన నీటిని తీసేసి, తర్వాత, పంటపై 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేస్తే త్వరగా కోలుకుంటుందన్నారు. అపరాలలో నిలిచిపోయిన నీటిని తీసేసి, వేరు కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కందిలో ఇనుము లోపం వచ్చే అవకాశం ఉన్నందున లోపాన్ని సరి చేయడానికి ఫెర్రస్ సల్ఫేట్ 5.0 గ్రాములు సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చయాలని, ఎక్కువగా ముంపునకు గురైన కంది పొలాల్లో నీరు తగ్గిన వెంటనే 20 కిలోల యూరియా, ఎకరానికి బూస్టర్ మోతాదులో వేసుకోవాలన్నారు. ప్రతి పంట నుంచి నిలబడిన అదనపు నీటిని తీసేసి, ఎండగా ఉన్న సమయంలో 1-2 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని, కాయగూరల పంటల్లో నీరు నిలిచినట్లైతే వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, నిలిచిన నీటిని వెంటనే బయటకి తీసి, నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

కాలుష్యం 'తాండవం'

డంపింగ్ యార్డ్‌గా మారిన నది

తాండవ నదిలో కాలుష్యం తాండవిస్తోంది. తుని మున్సిపాలిటీ, పాయకరావుపేట పంచాయతీ అధికారులు విపరీతంగా చెత్తను డంప్ చేస్తూ అనధికార డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు ఆక్రమణలకు గురవడంతో కుంచించుకుపోతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాండవ ఉనికి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. క్రమంగా కాలుష్యకాసారంగా మారుతోంది.



తుని వైపున రాజుల గోళీల వద్ద తాండవ నదిలో వేస్తున్న తుని మున్సిపాలిటీ చెత్త



ఇరువైపులా వేస్తున్న చెత్తతో మూసుకుపోతున్న తాండవ నది

పాయకరావుపేట: తాండవ నది పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. పాయకరావుపేట పంచాయతీ, తుని మున్సిపాలిటీకి చెందిన వందలాది టన్నుల చెత్తను తాండవ నదిలో వేస్తుండడంతో డంపింగ్ యార్డ్‌గా మారింది. తాండవ నదిపై నిర్మించిన ముఠా ఆనకట్ట వద్ద పాయకరావుపేట పంచాయతీ చెత్తను, ఆవలి ఒడ్డును తుని మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. గోనె సంచులు, చేపల మార్కెట్, చికెన్ సెంటర్ల నుంచి వస్తున్న వ్యర్థాలను నదిలోనే పడేస్తున్నారు. దీంతో నది పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ నీటిని తాగుతున్న జీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. చెత్త భారీగా పేరుకుపోడంతో తాండవ నదీ గర్భం కుచించుకుపోతోంది. ఈ నదిపై ఆధారపడి మండలంలో 24 గ్రామాల్లో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ నది నీటినే వినియోగిస్తున్నారు. తాండవ గర్భం కుచించుకుపోవడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండే నదీ పరీవాహక ప్రాంతం ఇప్పుడు రోతపుట్టించే విధంగా మారింది. గతంలో తుపాన్లు వచ్చిన సమయంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహించింది. చెత్త కారణంగా ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో మంగవరం, సత్యవరం, మాసాహేబ్ పేట ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకు వచ్చింది. చెత్త డంపింగ్ ఇలాగే కొనసాగితే తుపాన్ల సమయంలో తాండవ నీరు పాయకరావుపేట పట్టణంలోని పల్లపు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి నదీ పరీవాహక ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, కాలుష్యం నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

తక్కువ వ్యయంతో అధిక పోషకాహారం



కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మాడుగుల రూరల్: తక్కువ వ్యయంతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ, ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వి.రమణమ్మ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా, కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం ఆవశ్యకత గురించి బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆకు కూరలు, బెల్లం, మునగ ఆకు, అటుకులు, తెలగపిండితో చేసిన ఆహారం తీసుకోవాలని, బాలామృతం కూడా ఎంతో శ్రేష్టమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ వ్యయంతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకళ, వెంకటలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పాఠశాల భవనాలు

రోలుగుంట: ఇటీవల భారీ వర్షాలకు మండలంలో గల పాత పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయి. వాటిని సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించి నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ రోలుగుంట మండల ఏఈ పి.వి.సత్యనారాయణ మంగళవారం మండలంలో గల దిబ్బలపాలెం, అర్ల, వెలంకాయలపాలెం, గుర్రాలబయిల, రాజన్నపేట తదితర పాఠశాలలను సందర్శించారు. దెబ్బతిన్న పాఠశాలల వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా చోట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని ఏఈ తెలిపారు.

గిరిజన గ్రామాల్లో జ్వరాలు

దేవరాపల్లి: మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల బెడద విపరీతంగా పెరగడంతో వాలాబు, చింతలపూడి పంచాయితీల పరిధిలోని శివారు గ్రామాలలో పలువురు సాధారణ జ్వరాలతో పాటు మలేరియా బారినపడ్డారు. ప్రతి ఇంటికి ఒకరు లేదా ఇద్దరు చొప్పున జ్వరాల బారిన పడి మంచాన మగ్గుతున్నారు. తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో నరకయాతన అనుభవిస్తున్నారు. సక్రమంగా వైద్య సేవలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్త వాలాబు, జుత్తాడపాలెం, కొత్తబొడ్డపాడు, చినసోంపురం గ్రామాల్లో పలువురు వృద్ధులు, మహిళలు జ్వరాలతో మగ్గుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టక పోవడం, వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ సమస్య అని గిరిజనులు వాపోతున్నారు.